
# మెగా పవర్‌లూం క్లస్టర్‌ను సిరిసిల్లకు తీసుకురావాలి

- పదేండ్లుగా కేంద్రాన్ని కోరినా ఫలితం శూన్యం
- కాంగ్రెస్ సర్కార్ విధానాలతో చేనేత సంక్షోభం
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కు కేటీఆర్ లేఖ



హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ప్రధాని మోదీని ఒప్పించి సిరిసిల్లా మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదేండ్లు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా, ఎంపీగా ఐదేళ్ల క్రితం కూడా బండి సంజయ్ ఎన్నిక అయినా నేతన్నలకు నిరాశే ఎదురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లుగా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చేందుకు తాను ఎన్ని ప్రయత్నాలు చేసినా కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదని చెప్పారు. కేంద్రంలో స్మృతీ ఇరానీ, అరుణ్ జైట్లీ వంటి అనేక మంది మంత్రులను తాను స్వయంగా కలిసి 10 లేఖలు రాసినా దక్కింది శూన్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు సిరిసిల్ల నేతన్నలకు సేవ చేసేందుకు సరైన సమయంగా గుర్తించాలని ఆయన గుర్తుచేశారు. బడ్జెట్‌లో సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను ప్రకటించేలా కేంద్రాన్ని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు.

### ఆత్మహత్యల్లేని సిరిసిల్ల కోసం..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని, చేనేత రంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అనేక సార్లు కోరినా పట్టించుకోవటంలేదని, సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఇక్కడి నేతన్నల కష్టాలు కొంత మేరకు తీరుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. చేతి నిండా పనిదొరికి మళ్లీ ఆత్మహత్యలులేని సిరిసిల్లను చూసే అవకాశం ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు.

# తలలు పగలగొట్టడమే ప్రజాపాలనా?

- రేవంత్‌రెడ్డిది నిరంకుశ పాలన
- ఆ పోలీసులను వదలం
- విద్యార్థుల్ని అధికారం కోసం వాడుకున్న రేవంత్ సన్నాసా? రాహులా?
- విద్యార్థులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి: కేటీఆర్



*బీఆర్ఎస్వీ నాయకుడికి తగిలిన దెబ్బను బీఆర్ఎస్ వర్కిగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చూపిస్తున్న గెల్లు శ్రీనివాస్. చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్*

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నవారి తలలు, వీపులు పగలగొట్టడం, ప్రజలపై పోలీసులతో దాడులు చేయడమే ప్రజాపాలనా? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే కూడా భరించలేని నిరంకుశ మనస్తత్వంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులపై పోలీసు దాడులు చేస్తూ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గురువారం ఆయన బీఆర్ఎస్వీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు, నోటిఫికేషన్ల గురించి అడిగినవారిని అవమానపరిచేలా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఇందుకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్న నిరుద్యోగులు, విద్యార్థులకు రాజకీయాలను రేవంత్‌రెడ్డి అంటగడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డితో సహ అనేకమందిని విద్యార్థులు కలిశారని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న తమతోపాటు ఇతర పార్టీ నాయకులను కలుస్తున్నారని చెప్పారు. విద్యార్థుల చుట్టూ చేరి వారిని ఎన్నికల కోసం వాడుకున్న రేవంత్‌రెడ్డి సన్నాసా? లేక అప్పుడు వారిని కలిసిన రాహుల్‌గాంధీ సన్నాసా? ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పాత అరాచకాల కాంగ్రెస్ పార్టీ మోసపూరితంగా కొత్త రూపంలో వచ్చిందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోగా, ఇప్పటికే ఉన్న సంక్షేమ పథకాలను కూడా రద్దు చేస్తున్నారని విమర్శించారు. ఇదేమి అన్యాయమని అడిగినవారిపై కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు వద్దన్న కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే ఏడు కొత్త వాటికి అనుమతులు ఇచ్చిందని చెప్పారు. నాడు 50 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి నేడు ఆ మాటే మర్చిపోయారని దుయ్యబట్టారు. 6 వేల ఉద్యోగాలే అదనంగా చేర్చి యువతను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

### ప్రతి ఒక్కరు తెలంగాణ కథానాయకులే

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రతి ఒక్క తెలంగాణ యువకుడు తెలంగాణ కథానాయకుడిగా నిలబడిపోతారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు మర్చిపోరని హెచ్చరించారు. విద్యార్థులపై పోలీసులు చేస్తున్న దాడులను విద్యార్థి నాయకులు తమ డైరీలో నమోదు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులపై, ప్రజలపై దాడులు చేస్తున్న పోలీస్ అధికారులను, తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 1.62 లక్షలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 40 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతూ ఉండేదని చెప్పారు. అందులోంచి 30 వేల ఉద్యోగాల నియామక పత్రాలను రేవంత్‌రెడ్డి ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఉద్యోగాల్లో 95% స్థానిక రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. పార్టీ విద్యార్థి విభాగం నుంచి అనేకమంది నాయకులకు ప్రజాప్రతినిధులుగా, చైర్మన్లుగా, మేయర్లుగా, జిల్లా స్థాయి అధ్యక్షులుగా అవకాశాలు కల్పించామని వివరించారు. నిజాయితీపరులు, దమ్మున్న నాయకులు బీఆర్ఎస్‌కు ఆస్తిగా ఉన్నారని చెప్పారు. 2009-2014 మధ్య తెలంగాణ కోసం విద్యార్థులు చేసిన పోరాటాలను ఇప్పటి విద్యార్థులకు చెప్పాలని సూచించారు. విద్యారంగంలో జరిగే ప్రతి అన్యాయంపై విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామియాదవ్, తుంగ బాలు, పడాల సతీశ్ పాల్గొన్నారు.

# ఈ మహా నగరానికి ఏమైంది?

## శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి.. ఎక్స్ వేదికగా కేటీఆర్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో శాంతిభద్రతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ఆందోళన వ్యక్తంచేశారు. పత్రికల్లో 'ఈ నగరానికి ఏమైంది?' అని వార్తలు రావడంపై ఆయన స్పందించారు. పరిపాలనా అనుభవంలేని నాయకత్వం ఎలా ఉంటుందో హైదరాబాద్ నుంచి తెలంగాణ పల్లెల వరకూ కనిపిస్తున్నదని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. విశ్వనగరంగా ఎదుగుతున్న వేళ.. హైదరాబాద్ బ్రాండ్ మసకబారుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వస్తున్నా పోలీసింగ్‌పై కమాండ్ ఏదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నగరంలో క్రైం రేటు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశరాజధాని చుట్టూ చక్కర్లు కొట్టకుండా చిక్కుల్లో ఉన్న రాష్ట్ర రాజధానిని కాపాడాలని కోరారు. కాంగ్రెస్ సర్కారు మేల్కొనకపోతే...హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటే రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికి నష్టమని స్పష్టంచేశారు. హైదరాబాద్ తెలంగాణ ఎకానమిక్ ఇంజిన్ అని అభివర్ణించారు.



# నిరాహార దీక్షను విరమించిన అశోక్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై11 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం గత పది రోజులుగా దీక్ష చేస్తున్న అశోక్ దీక్ష విరమించారు. గురువారం సాయంత్రం వివిధ సంఘాల నాయకులు చైతన్యపురిలో అశోక్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఆయన ఆరోగ్యం విషమించడంతో విద్యార్థులతో కలిసి దీక్షను విరమింపచేశారు. ఈ సందర్భంగా బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ మాట్లాడుతూ.. అశోక్‌ది కేవలం దీక్ష విరమణ మాత్రమేనని, పోరాట విరమణ కాదని చెప్పారు. విద్యార్థుల పక్షాన ఎంతవరకైనా కొట్లాడతామని, నిరుద్యోగుల డిమాండ్లు సాధిస్తామని పేర్కొన్నారు. జూలై 15న సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమైందని విమర్శించారు.

# జర్నలిస్టు శ్రీచరణ్‌పై దాడి హేయం

**హనుమకొండ, మహబూబాబాద్‌లో నిరసన**

హనుమకొండ చౌరస్తా, మహబూబాబాద్ రూరల్, జూలై 11 : ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ గురువారం టీయూడబ్ల్యూజే (హెచ్-143) హనుమకొండ జిల్లా శాఖ పక్షాన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిరసన తెలిపారు. డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని ఓయూలో నిరుద్యోగ యువకులు ఆందోళన చేస్తుంటే కవర్ చేయడానికి వెళ్లిన జీ న్యూస్ జర్నలిస్టు శ్రీచరణ్‌ను పోలీసులు అరెస్టు చేయడం హేయనీయమని, పోలీసుస్టేషన్‌లో నిర్బంధించడం మీడియా భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. అటు.. మహబూబాబాద్‌లోని నెహ్రూసెంటర్ వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు.



*డీఎస్సీ వాయిదా వేయాలని జనగామలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు*

# మోకాళ్లపై నిల్చొని నిరుద్యోగ జేఏసీ నేతల నిరసన

- డీఎస్సీ వాయిదా వేయాలి
- నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు పిలుపు

జనగామ, జూలై 11 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీ వాయిదా వేయాలని కోరుతూ జనగామలో నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం యువకులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, డీఎస్సీ వాయిదా వంటి అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ నిలదీయాలని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు పిలుపునిచ్చారు. నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు అమ్ముడుపోయారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. నిరసనలో నిరుద్యోగ జేఏసీ నాయకులు, కేయూ జేఏసీ నాయకులు గన్ను కార్తీక్, ఆసర్ల సుభాష్, తుంగ కౌశిక్, వెంపటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ వాయిదాకు ఢిల్లీకి నిరుద్యోగులు

మొదటిపేజీ తరువాయి...

చేసుకోవాలని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా 11,062 టీచర్ పోస్టులకు జూన్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు 2.7 లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ పేమెంట్ రిఫరెన్స్ ఐడీ లేదా ఆధార్ నంబర్ , పోస్టు క్యాటగిరీ, మాధ్యమం, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్‌చేసి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వివరాలకు https://tsdsc.aptonline.in/tsdsc/Hallticket ను చూడవచ్చు.

# న్యాయవాదిపై పోలీసుల దాడి హేయం

- సిద్దిపేట ఘటనపై హైకోర్టు బార్ అసోసియేషన్ ఖండన

హైదరాబాద్, జులై11 (నమస్తే తెలంగాణ): సిద్దిపేటలో ఓ న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడాన్ని హైకోర్టు బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది.హైకోర్టు ఆవరణలో గురువారం న్యాయవాదులు పోలీసుల చర్యపై నిరసన తెలిపారు.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక కేసులో ముందస్తు బెయిల్ ఉత్తర్వుల ప్రతిని సమర్పించేందుకు వెళ్లిన న్యాయవాది రవికుమార్‌పై ఏఎస్‌ఐ ఉమారెడ్డి దాడి చేయడం హేయమని మండిపడ్డారు. సీఐ ఆదేశాలకు అనుగుణంగానే ఏఎస్ఐ దాడి చేశారని ఆరోపించారు.ఈ సందర్భంగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాడిని ప్రశ్నించిన న్యాయవాది ఫోన్‌ను లాక్కోవడమే కాకుండా తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. పైగా, న్యాయవాదే విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. డీజీపీ జోక్యం చేసుకుని ఏఎస్ఐతో పాటు తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదులో పాల్గొన్న పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఎస్ఐ ఉమారెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోపాటు న్యాయవాదిపై పెట్టిన ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతిభూషణ్, సంజీవ్, సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

# దాడులు చేయడమే ప్రజాపాలనా?

- శాంతియుతంగా నిరసన తెలిపితే తప్పా?
- ఉస్మానియా యూనివర్సిటీని పోలీస్ క్యాంప్‌గా మార్చిండ్రు
- హాస్టళ్లు, లైబ్రరీల్లోకి వచ్చి అరెస్టులా?
- జర్నలిస్టులు, నిరుద్యోగులపై దాడి చేసిన పోలీసుల్ని సస్పెండ్ చేయాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 11: 'ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులు, నిరుద్యోగులపై దాడిచేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి. ప్రజాపాలన అంటే దాడులు చేయడమా? శాంతియుతంగా నిరసన తెలిపితే తప్పా? ఓయూలో 300మంది పోలీస్ సిబ్బంది ఎందుకు పహారా కాస్తున్నట్టు? దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి' అని వివిధ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఓయూలో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు, విద్యార్థులు, వార్తల కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసుల దాడి, అరెస్టులను తీవ్రంగా ఖండించాయి. ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలని, అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. డిమాండ్ల సాధన కోసం నిరుద్యోగులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలుపుతుంటే పరిష్కరించకుండా ఓయూను పోలీస్ క్యాంపుగా మార్చారని, హాస్టళ్లు, క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీల్లోకి చొరబడి అరెస్టులు చేస్తూ, భౌతిక దాడులకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ హాస్టళ్లలోకి చొరబడి విద్యార్థి నాయకులను అరెస్టు చేసిన సందర్భాలు లేవని గుర్తుచేశారు. ఓయూలో పోలీసు పహారాను తొలగించి ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

### దాడి అమానుషం: పీడీఎస్‌యూ

ఓయూలో పోలీసుల దాడులు అమానుషమని, ఈ ఘటనను ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్. నాగేశ్వరరావు, ఓయూ అధ్యక్షుడు సుమంత్ చెప్పారు. ప్రతిష్ఠాత్మక ఆర్ట్స్ కళాశాల తెలంగాణ ప్రజలకు భరోసా కేంద్రమని, ఇక్కడించి తమ గొంతు వినిపిస్తే న్యాయం జరుగుతుందనే భావన ప్రజల్లో ఉంటుందని, అలాంటి ఓయూలో పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులు పిడిగుద్దులు గుద్దుతూ, గల్లాలు పట్టి ఈడ్చుకుపోవడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

### ప్రశ్నించే గొంతుక ఓయూ: టీజీవీపీ

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రశ్నించే గొంతుక ఉస్మానియా యూనివర్సిటీ అని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ప్రశాంత్ పేర్కొన్నారు. ఓయూలో దాడులు ప్రజాస్వామ్యానికే విరుద్ధమని, ఆ పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

### అక్రమ అరెస్టులు దారుణం: ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



నిరుద్యోగులు, జర్నలిస్టుల అక్రమ అరెస్టులు దారుణమని దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. తార్నాకలోని తన కార్యాలయంలో విలేకరులతో యన మాట్లాడుతూ న్యాయం చేయాలని మూడు నెలలుగా 30 లక్షల మందికి పైగా నిరుద్యోగులు నిరసన తెలుపుతుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం, మరోవైపు విధుల్లో ఉన్న విలేకరులపై దౌర్జన్యం చేస్తూ అరెస్టు చేయడం ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. తక్షణమే వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్ష చేస్తున్న బక్క జడ్సన్, అశోక్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం ఏర్పడినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.



*సమీక్ష సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, సీఎస్ శాంతికుమారి తదితరులు*

# అధికారులు ప్రొటోకాల్ పాటించరా?

- వారికి స్పష్టమైన ఆదేశాలివ్వండి
- స్పీకర్, మండలి చైర్మన్ అసంతృప్తి
- సీఎస్, డీజీపీతో సమీక్ష సమావేశం
- 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు?

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : ప్రొటోకాల్ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పర్యటనలకు, కొన్నిసార్లు స్పీకర్, మండలి చైర్మన్లకు కూడా అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ దృష్టికి తీసుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాలను ఈనెల 24న ప్రారంభించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో గురువారం స్పీకర్ చాంబర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్రప్రభుత్వం కూడా బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నందున తగిన ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాల్లో స్పీకర్, చైర్మన్ పర్యటించినప్పుడు ఆర్డీవో, కనీసం ఎమ్మార్వో స్థాయి అధికారి రావాల్సి ఉన్నా ఎక్కడా పాటించడంలేదని, జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో కనీస ప్రొటోకాల్ పాటించడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మంత్రుల పర్యటనల్లోనూ పోలీసులు ప్రొటోకాల్ పాటిండచం లేదని చెప్పారు. ఎస్సై స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అమలు కావడంలేదన్నారు. ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఇది భవిష్యత్తులో ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులకు ఆదేశాలివ్వాలని సీఎస్, డీజీపీలకు సూచించారు. జిల్లాలకు కొత్తగా ఉన్నతాధికారులు బదిలీపై వస్తే మర్యాదపూర్వకంగా స్పీకర్, చైర్మన్‌ను కలవాల్సి ఉంటుందని, ఇదికూడా జరగడంలేదని వాపోయారు. ఎయిర్‌పోర్ట్‌లో స్పీకర్, చైర్మన్, ఇతర చట్టసభల ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ పాటించడం లేదని, సినిమా వారికి, సెలబ్రిటీలకు పాటిస్తున్న ప్రొటోకాల్‌ను కూడా చట్టసభల అధిపతులు, ప్రజాప్రతినిధులకు ఇవ్వడంలేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. శాసనసభ, శాసనమండలి, లెజిస్లేచర్ సెక్రటేరియట్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లనేలలో 'ఎర్ర' చట్టం!


- సింగరేణిలో 'ఎల్లో, రెడ్' వార్నింగ్
- యాజమాన్యం కొత్త సర్క్యులర్
- సంజాయిషీకి అవకాశమే లేదు
- భూపాలపల్లిలో 34 మందికి కార్డులు జారీ

జయశంకర్ భూపాలపల్లి, జూలై 11 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో యాజమాన్యం మరో నల్లచట్టం తీసుకొచ్చింది. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో చర్చించకుండానే దానిని అమలు చేసింది. ఎల్లో, రెడ్ కార్డుల పేరుతో తీసుకొచ్చిన ఈ కొత్త సర్క్యులర్‌తో కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గనిలో కార్మికుడు తప్పు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా మొదట ఎల్లో కార్డు పేరుతో కార్మికుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపిస్తారు. ఇలా రెండు మూడు సార్లు ఎల్లో కార్డు మెసేజ్ తర్వాత రెడ్ కార్డ్ మెసేజ్ వస్తుంది. అనంతరం కార్మికుడిపై చర్యలకు సిద్ధం చేస్తారు. ఇక కార్మికుడు సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితి ఉండదు. ఉత్పత్తి, ఉత్పాదకతే లక్ష్యంగా సింగరేణి సంస్థ ముందుకుసాగుతూ.. కార్మికులపై నల్ల చట్టాలను అమలు చేస్తూ మానసికంగా హింసిస్తున్నదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. తాజాగా యాజమాన్యం అమలు చేస్తున్న నూతన సర్క్యులర్‌తో కార్మికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. భూపాలపల్లి ఏరియాలో ఒక్క నెలలోనే 34 మందికి రెడ్, ఎల్లో కార్డులు జారీ చేశారంటే.. సింగరేణి వ్యాప్తంగా ఎంతమందికి జారీ చేసి ఉంటారో అవగతమవుతున్నది.

### విచారణకు స్వస్తి

గనుల్లో ఏవైనా ప్రమాదాలు, తప్పులు జరిగితే.. అలా ఎందుకు జరిగిందో తెలుసుకునేందుకు ఇకపై విచారణలుండవు. కొత్త సర్క్యులర్ ప్రకారం ఎల్లో కార్డు, అనంతరం రెడ్ కార్డులు జారీ చేసి చర్యలు తీసుకోవడమే ఉంటుంది. సదరు కార్మికుడు సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితి ఉండదు. సెల్‌ఫోన్‌కు ఎల్లో, రెడ్ కార్డు మెసేజ్ వస్తే.. శిక్ష అనుభవించడానికి సిద్ధంగా ఉండాల్సిందే. గతంలో కార్మికుడు గనిలో తప్పు చేస్తే విచారణ జరిపి తప్పు చేసినట్టు నిరూపణ అయితే చార్జిషీట్ ఇవ్వడం లేక మరో చర్య తీసుకునే వారు. డీజీఎంఎస్ విచారణలు కూడా జరిగేవి. ఇలాంటి విచారణలకు యాజమాన్యం స్వస్తి పలికింది. సింగరేణిలో పని చేసే కార్మికుల్లో నిరుద్యోగులే. సెల్‌ఫోన్లలో మెసేజ్‌లు చదువుకోవడం రాక, అక్షరాస్యులైతే ఒక్కోసారి చూసుకోలేకపోతే యాజమాన్యం చర్యలు తీసుకునే వరకు కార్మికుడికి తెలియని పరిస్థితి నెలకొంది. పనిస్థలాల్లో సరైన సౌకర్యాలు కల్పించకుండా, రక్షణ పరికరాలు అందించకుండా తప్పుచేసిన కార్మికుడిపై ఎల్లో, రెడ్ కార్డులు తీసుకురావడంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. కార్మికులకు సక్రమంగా బూట్లు, హెల్మెట్‌లు తదితర రక్షణ పరికరాలు అందించడం లేదని, కాలం చెల్లిన యంత్రాలతో పనులు చేయిస్తున్నారని, ఇలాంటప్పుడు ప్రమాదాలు జరగకుండా ఎలా ఉంటాయి? దీనికి కార్మికుడిని బాధ్యుడిని చేయడం ఎంత వరకు సమంజసం? అని ప్రశ్నిస్తున్నాయి.






### కార్డులు రద్దు చేయాలి

అధికారుల ప్రమోషన్లు, ఆర్థిక ప్రయోజనాల కోసం కార్మికులను బలిపశువులను చేస్తున్నారు. రెడ్ కార్డు అందుకున్న ఉద్యోగికి చార్జిషీట్‌తోపాటు సస్పెన్షన్, ఇంక్రిమెంట్ కోత, డిస్మిస్ వంటి తీవ్రమైన క్రమశిక్షణ చర్యలకు యాజమాన్యం సిద్ధమవుతున్నది. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. వెంటనే ఎల్లో, రెడ్ కార్డు విధానాన్ని రద్దు చేయాలి. లేకపోతే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం

**-మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు**



### చార్జిషీట్ ఇవ్వాలి

కార్మికుడు, అధికారి తప్పులు చేస్తే స్టాండింగ్ ఆర్డర్స్, మైన్స్ యాక్టులు, డీజీఎంఎస్ విచారణలు అనేకమున్నాయి. ఇప్పుడు కొత్తగా ఎల్లో, రెడ్ కార్డులు ఏంటీ? ఇదేమైనా ఫుట్‌బాల్, హాకీ గేమ్‌లా? తమాషాగా ఉందా? తప్పు జరిగితే చార్జిషీట్ ఇవ్వాలి. ప్రిమిలినరీ విచారణ జరపాలి. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ చేతగానితనం వల్లే యాజమాన్యం ఇలాంటి కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నది. వెంటనే ఈ సిస్టం ఆపాలి. ఈ విషయమై సింగరేణి సీఎండీకి లేఖ రాసిన.

**-రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధానకార్యదర్శి**